దూరపు బంధువు. తిరుపతి చూపిస్తానని మాయమాటలు చెప్పి తీసుకెళ్ళిపోతున్నాడట.

★ ★ ★

తిరుపతి ప్రాంతంలో జరిగిన మూడు హత్యలు పరిష్కారమయ్యాయి. కుప్పుస్వామి హంతకుడని తేలింది. కోదండపాణి దర్యాప్తులో తెలిసిన విషయం ఏమిటంటే కుప్పుస్వామి రౌడీయే కాదు, శాడిస్ట్! అని. మొదటిసారి తిరువణ్ణామలై నుంచి ఒక అమ్మాయిని తీసుకొచ్చి తిరుపతిలో హత్య చేయడం ఎవరూ కనిపెట్టకపోవడంతో అతని రాక్షస ప్రవృత్తి మరో ఇద్దరు అమ్మాయిల్ని తీసుకుంది. అదృష్టవశాత్తు నాలుగో అమ్మాయి బలికాకుండా కోదండపాణి దేవుడిలా అడ్డుపడ్డాడు.

★ ★ ★

పోలీసు పరిశోధనలు ఒక్కొక్కప్పుడు చిత్రంగా ఉంటాయి. మూడు హత్యలను ఎందుకు పనికిరాని రెండు బస్సు టిక్కెట్లు, ఒక గోనెసంచి పరిష్కరించడానికి తోడ్పడ్డాయంటే ఎవరూ నమ్మరు. కానీ నిజం కల్పితం కంటే చిత్రంగా ఉంటుంది.

## చిరుమెరుపు

"సిగరెట్టి పీకతో హత్య పరిష్కారం" పేపర్‌లో నుంచి పెద్దగా చదువుతూ నా మిత్రుడు నన్ను ఉద్దేశించి అన్నాడు. శ్రీశ్రీ మీ మీద కూడా ఒక కవిత రాసినట్టయితే బావుండేది గదా! కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల కాదేది పరిశోధన కనర్హం అని. ●

# లక్కీఫెలో

కథ

వి.పి.బి.నాయర్



సమస్యలు లేకుండా బ్రతకడం ఏ మనిషికీ సాధ్యం కాదేమో! సమస్యలు లేకుండా ఉంటే ఒక్కోసారి లైఫ్ 'బోరింగ్'గా ఉంటుంది. సమస్యలుంటే లైఫ్ థ్రిల్లింగ్‌గానూ ఉంటుంది. సమస్యలు ఎక్కువైనా ఒక్కోసారి జీవితం మీద విరక్తి కలుగుతుంది. ఒక్కొక్కసారి వచ్చే సమస్యలు నవ్వు పుట్టించేవిగాను, తమాషాగాను ఉంటాయి. ఇక్కడ కాదంబరికి వచ్చిన సమస్యే తమాషాగాను, నవ్వు పుట్టించేదిగాను ఉంది.

ఓ రోజు కాదంబరి భర్త ఆఫీసుకి వెళ్లగానే ఇంటి పనులన్నీ ముగించుకుని యధాలాపంగా వీధి గుమ్మంలోంచి రోడ్డు వైపుకు చూస్తూ నిల్చుంది. దూరంగా ఆమెకూ, నగటు మధ్యతరగతి స్త్రీలు ఎంతో మందికీ ఇష్టమైన దృశ్యం కనిపించింది. వెంటనే మనసులోనే ఏవేవి, ఎక్కడ ఉన్నాయో, ఎన్ని ఇచ్చేయవచ్చో లెక్కలు వేసుకుంది.

ఇంతకీ ఆమెకు కనిపించిన దృశ్యం తలపై స్టీలు గిన్నెలు అమ్మే వ్యక్తి. నెత్తిన తట్ట పెట్టుకుని "పాత బట్టలకు స్టీలు గిన్నెలూ" అంటూ అరుస్తూ కేశన్న వస్తున్నాడు.

ఆవేళ పాతగుడ్డలకు స్టీలు గిన్నెలు అమ్ముకునే కేశన్న మనోవైచిత్రి మరోలా ఉంది. "వెధవ వ్యాపారం ఎంతకాలం చేస్తాను? రోజూ ఈ గిన్నెలు మోసుకుని ఊరంతా తిరగడం, వాళ్లూ వీళ్లూ వాడేసి పడేసిన పాతగుడ్డల మోత, స్టీలుగిన్నెల మోత కంటె బరువుగా ఉంటుంది ఒక్కోసారి. గిన్నెలన్నీ అమ్ముడైతే ఫర్వాలేదు. లేకపోతే సగం అమ్ముడైతే ఒక్కోసారి గుడ్డలూ, గిన్నెలూ కలిసి మోయాల్సి వస్తుంది పాలకొరకు రాతిని మోసినట్లుగా. కనీసం ఓ సైకిలో, మోపెడ్డో ఉంటే ప్రాణం హాయిగా ఉండును. కనీసం చిన్న ఉద్యోగంలాంటిది ఉన్నా ఉదయం పది గంటలకే పోయి సాయంత్రం ఐదు గంటలకు చేరుకునే జీవితం ఎంత హాయిగా ఉంటుందో కదా?" అని ఊహించుకుంటూ పోతూండగా "ఇదిగో స్టీలు గిన్నె లబ్బీ" అంటూ పిల్చిన కాదంబరి కేక అతనికి బ్రేకు వేసింది. కేశన్న ఆగాడు. కాదంబరి కళ్లన్నీ స్టీలు పాత్రలు, వాటి మెరుపులు, సైజుల మీద పడ్డాయి.

"చూడబ్బీ! ఎక్కువ బట్టలు ఏం లేవు. అయ్యగారివన్నీ ఆఫీస్ ప్యూన్ తీసేసుకున్నాడు. నీలాంటి వాళ్లు వస్తారని నా పాత చీరలన్నీ దాచి ఉంచాను. తెస్తానుండు. బేరం ఏమీ లేకుండా ఈ పెద్ద స్టీలు క్యాన్ ఇచ్చెయ్. ఎన్నాళ్ల నుంచో ఇలాంటిది కొనాలని చూస్తుంటే కుదరడం లేదు" అంటూ కాదంబరి ముందుకు వంగింది క్యాన్ తీసుకుని చూడ్డానికి. అలా వంగడంలో ఆమె ఎదలో అప్పటివరకు కుచద్వయం మధ్య దాగి ఉన్న గొలుసు బయటకు వచ్చి ముందుకూ, వెనక్కూ ఊగింది. కేశన్న కళ్లు తిప్పుకోలేకపోయాడు. ఆమె కుచద్వయం నునుపునీ, మెరుపునీ చూసి కాదు, తననే ఆహ్వానిస్తున్నట్లుగా తళతళా మెరుస్తున్న బంగారు గొలుసును చూసి. అతని మస్తిష్కంలో ఆలోచనలు బయల్దేరాయి. 'రేట్లు పెరిగాయి. ఐదు వేలకి తక్కువ ఉండదు' అనుకుంటూ మురిసిపోసాగాడు. వెంటనే ఓ ఆలోచన అప్పటికప్పుడే రూపుదిద్దుకుంది.

"సరేనమ్మా చూపించండి" అన్నాడు. కాదంబరి పాతచీరలు తేవడానికి లోపలికి వెళ్లగానే ఓసారి బయటకు వెళ్లి రోడ్డుకు అటూ ఇటూ చూసి జన సంచారం లేకపోవడం గమనించాడు. 'తన పంట పండినట్లే' అనుకుని లోపలికి నడిచాడు.

కాదంబరి లోపల్నుంచి చీరలు తీసుకువస్తుండగా ఎదురుగా వెళ్లి 'నీ ప్రాణానికేం భయంలేదు' అంటూ ఆమె మెడలో చెయ్యిపెట్టి ఆమె గొలును విసురుగా లాగాడు. సన్నగా ఉందేమో వెంటనే తెగిపోయి చేతికి వచ్చేసింది. తాను తెచ్చిన చీరల అందాలు చూసి ఆవేశంలో అలా లాక్కోడానికి లేచాడేమోననుకున్న కాదంబరి తన శీలానికి ముప్పు రాబోతుందేమోనన్న శంకతో వాటిని వదిలేసి కెవ్వున అరచి కళ్లు మూసుకుంది భయంతో. కొన్ని క్షణాలు నిశ్శబ్దం తర్వాత కాదంబరి కళ్లు తెరచి చూసేసరికి ఎదురుగా తాను తెచ్చిన చీరలు కింద పడి ఉన్నాయి. స్టీలు గిన్నెల వాడు రోడ్డుపై ఆదరాబాదరాగా పరిగెడుతూ కనిపించాడు. ఎదురుగా వాడు వదిలేసిన తళతళలాడుతున్న నిండు స్టీలు గిన్నెల బుట్ట కనువిందుగా కనిపించింది. ఉదయాన్నే వచ్చాడేమో, ఒక్కటీ అమ్ముడుపోలేదు. వాటిని చూసి తన మెడ తడుముకుంటూ జరిగిందేమిటో గ్రహించి పకపకా పడీ పడీ నవ్వింది. ఆమె నవ్వును చుట్టుపక్కల వారు ఎవరైనా చూసి ఉంటే తెలుగు సినిమాలో మోసపోయిన హీరోయిన్ క్లైమాక్స్‌లో పిచ్చిపట్టి ఎలా నవ్వుతుందో అలా అగుపించేది.

ఇంతకూ ఆమె మెడలోంచి వాడు తెంపుకు వెళ్లింది రోల్డుగోల్డ్ చెయిన్. దొంగల భయం ఎక్కువగా ఉందని భర్త తన వస్తువులన్నీ ఎప్పుడో లాకర్‌లో పెట్టేశాడు.

కేశన్న వదిలేసి వెళ్లిన ఈ స్టీలు సామాను విలువ ఐదు వందలకు పైగానే ఉంటుంది. వీటితో అలాంటివి యాభై గొలుసులు కొనుక్కోవచ్చు అనుకుంటూ బుట్టలో సామాను గబగబా తీసుకెళ్లి కిచెన్ రూమ్‌లో అలంకరించి తృప్తిగా చూసుకుంది లక్కీఫెలో కాదంబరి. ●